# 7 ధైర్యే సాహసే లక్ష్మి

పాఠం చెప్పడం పూర్తిచేసి, అమ్మాయి వెళ్ళిపోగానే తానూ తిరిగి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు సుదర్శనం. మామూలుగా ఈ సమయానికి పద్మిని అక్కడికి రావడం అలవాటు- పాఠాలు ఎలా సాగుతున్నాయో తెలుసుకోడానికి.

సున్నితంగా గదిలోనికి వచ్చిన అడుగుల సవ్వడి సుదర్శనానికి మొదట వినపడలేదు. కాని, గాలిలో తేలుతూవచ్చిన పరిమళాలు ఆమె రాకని అతనికి సూచించాయి.

"వసంత నిన్న రాత్రి తెగ చదివిందండీ! ఇవాళ ప్రశ్నలు వేసినట్టున్నారు. ఏమైనా చెప్పిందా?"

"బాగానే చెప్పింది—తెలివైనది వసంత."

—ఇలాగ, రోజూలాగే సంభాషణ ప్రారంభించడంతో చాలా బాధపడ్డాడు సుదర్శనం. ఆమె తనకి తానే ఆ ప్రసక్తి తేవకపోతే, తానే తేవాలి. అది అంత సరసంగా ఉండదు....కాని....

"మీరంటే దానికి భక్తి కుదిరింది....ఇంతకు ముందు ఇద్దరు మాస్టర్లని పెట్టేము. వాళ్ళని అసలు ఖాతరుచేస్తేనా అది!"

ఆ మెపంక చూస్తూ అలాగే నిలబడిపోయాడు సుదర్శనం మంచులాటి తెల్లని చీరా, దాని పల్చదనంలోనించి దొంగచూపులు చూస్తూన్న బ్లౌజూ, దాని వెనుక....మెడ లేతలేత కాంతుల్లో, దిగువ ఎత్తుపల్లాలలో సంతృప్తిగా నిద్రిస్తోన్న బంగారు గొలుసు....ఈ రోజు ఆ గొలుసుని చూస్తూంటే అతని మనసులో వివిధ భావాలు బలంగా రేకెత్తుతున్నాయ్.

"వెడతాను...."

నీరసంగా అన్నాడు. "అప్పుడే?—ఒక్క క్షణం ఆగండి" అని, ఆమె....అట్లా ఊహించాడు సుదర్శనం....కాని....

"మంచిదండీ—" అంది పద్మిని.

నీరసంగా అడుగులు వేసుకుని బయటికి నడిచాడు సుదర్శనం తనని తాను తిట్టుకుంటూ. పిరికిపంద తను. తన దానికోసం—తన హక్కు కోసం కూడా నోరెత్తలేదు తను.

పద్మినిని చూసి భయమా తనకి?

ఔను—కాదు....పోనీ, ఆ విషయం వాళ్ళ నాన్నగారితో మాట్లాడితే?

అది మరీ తప్పుగా కనిపించింది. ఈ వ్యవహారంలో బాధ్యత అంతా పద్మినిదే....ఆమె మరీ చిన్నపిల్ల కాదు. ఇప్పటికే తన పిరికి తనంవల్ల ఇంత ఆలస్యం ఐపోయింది!....రేపు, ఎలాగేనా తాను సాహసించి తీరాలి. లేకపోతే....

నీరసంగా రూములోకి వచ్చి మంచంమీద వాలాడు సుదర్శనం. గది అంతా ధూళితో, చిన్న చిన్న వస్తువులతో చిందర వందరగా ఉంది. కాని, యిప్పుడు అదేమీ తనని బాధించడంలేదు. వీటన్నిటికి ఒకే ఒక పరిష్కారం. అది పద్మిని చేతుల్లో ఉంది. ఆ సుందర కోమల హస్తాలు తన వైపు జాచి ఆమె....ఆలోచన సాగలేదు సుదర్శనానికి.

కడుపు గొడవ చేస్తోంది. కాని, ప్రస్తుత అనర్థ పరిస్థితులు హోటలుకి పోయి భోజనంచేసే శక్తి లేకుండా చేశాయి తనకి. లేచి, ఎదురుగా ఉన్న టీ దుకాణంలో పకోడీలు తిని, టీ త్రాగి తిరిగివచ్చి మళ్ళా మంచంమీద వాలేడు సుదర్శనం.

నిద్రపట్టదు.

గోడలోని పెద్ద ఖాళీలోనించి చంద్రోదయం కనిపించింది. కళ్ళు తెరిచేసరికి సుదర్శనానికి వెనువెంటనే కలువలూ, పద్మాలూ జ్ఞాపకం వొచ్చి పద్మిని మనసులోనికి వచ్చింది....

ఈ బాధ తాను భరించలేదు. రేపు సాహసించి ఆమెని అడగక

పోతే, తన బతుకే దుర్భరం ఐపోతుంది. ఒకవేళ ఆమెకు కోపం వచ్చి వ్యవహారం మొదటికి చెడితే?

ఏమైనా, తనకున్న ఈ ఒక్క ఆశా వృధా చేసుకోదల్చలేదు. అంతగా వొస్తే అప్పుడేదో చెయ్యవచ్చు. అయినా, పద్మిని అంత అమానషంగా ప్రవర్తిస్తుందా?

ఆలోచనలతోనే తెల్లారినట్లనిపించింది. సూర్యోదయం— పద్మిని....

ఈ రోజు తేల్చుకోక తప్పదని నిశ్చయించుకున్నాడు సుదర్శనం.

* * *

మళ్ళా ఆ తతంగం అంతా అయి, పాఠం ఎలాగో పూర్తి చేసి, వసంతని బయటికి పంపేశాడు సుదర్శనం. వెనువెంటనే పద్మిని లోపలకి రానే వచ్చింది.

మనసు దిటవు పరుచుకుని, ధైర్యే సాహసే లక్ష్మీ అని అనుకుని...."మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాను...." అన్నాడు సుదర్శనం నీరసంగా—రాత్రి తాను పడిన బాధని నెమరువేసుకుంటూ.

"ఏమిటి?" అంది తేలికగా పద్మిని.

ధైర్యంగా, గంభీరంగా అనేశాడు సుదర్శనం, "ఈ నెల జీతం మరిచిపోయారనుకుంటాను....జ్ఞాపకం చేద్దామని...."

"అయ్యో! నాన్నగారు మొన్ననే ఇచ్చారు. నా మతి!" అంటూ పద్మిని లోపలికి వెళ్ళింది.

దిగ్విజయంచేసి, దివ్యసుఖాలన్నీ ఒక్కసారి చవిచూసినంత ఆనందం వచ్చింది సుదర్శనానికి. తన సాహసం వృథా కాలేదు!